సంక్షేమం ఊసే లేని కూటమి ప్రభుత్వం

- సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూస్తున్న ప్రజానీకం
- జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా సంక్షేమ పండగే
- చిరు వ్యాపారాలతో ఆర్థికంగా నిలబడ్డ మహిళా లోకం
- పులివెందుల నియోజకవర్గానికి సంక్షేమం, అభివృద్ధికి రూ.3,500 కోట్లు


ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

వేంపల్లె : గత ఐదేళ్లు సంక్షేమ జాతరతో ఇంటింటా పండుగ చేసుకుంటున్న ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం షాకిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలకు చిర్రెత్తుకొస్తోంది. కుళాయిల వద్ద, టీ కొట్టు వద్ద, కిరాణా దుకాణాల దగ్గర కూటమి ప్రభుత్వ తీరుపై మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. జగన్ ఉంటే ఈపాటికి నెలకు సంక్షేమం చొప్పున తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారని, కానీ నేడు ప్రభుత్వం ఏర్పడి ఏడాది దగ్గర పడుతున్నా ఇంతవరకు ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయకపోగా.. బడ్జెట్‌లో సైతం పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపులు జరపలేదని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం పెంచిన పింఛన్‌ను మాత్రమే ఇచ్చారని, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచిత పథకం కూడా అరకొరగానే జరుగుతోందని విమర్శలు అధికంగానే వినిపిస్తున్నాయి. పెట్టే వారిని దూరం చేసుకున్నామని. కొట్టే వారిని అందలమెక్కించారంటూ ప్రజానీకం బాహాటంగానే విమర్శించే దుస్థితి నెలకొంది.

జగన్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి రూ.3,500 కోట్లు

గత జగన్ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి పులివెందుల నియోజకవర్గంలో రూ.3,500 కోట్లు ఖర్చు చేశారు. పులివెందుల మున్సిపాలిటీ, తర్వాత వేంపల్లె మండలంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అర్హులైన పేదలందరికీ సంక్షేమం, రహదారులు, తాగునీరు, మెడికల్ కాలేజీ, కళాశాలలు, నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా జగనన్న అమ్మఒడి, డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కళ్యాణమస్తు, వివిధ పంటలకు రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వాహన మిత్ర, వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న చేదోడు వంటి పథకాలతో జగన్ ప్రభుత్వం పేద వర్గాలకు అండగా నిలిచింది. దీంతోపాటు కోవిడ్ సమయంలో సైతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజల చేతిలో డబ్బులు ఉండటంతో ఎటువంటి ఇబ్బందులు రాకపోగా.. మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగిందని వ్యాపార వర్గాలే డంకా మోగించి చెబుతున్నారు. కూటమి నేతల మాయ మాటలు నమ్మి మోసపోయామంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.

పేద వర్గాలు అల్లాడుతున్నారు



సంక్షేమం లేక పేదవర్గాలు అల్లాడిపోతున్నారు. జగన్ ప్రభుత్వంలో రుచిచూసిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు. జగన్ హయాంలో ప్రతినెలా పండగ వాతావరణం నెలకొనేది. పండుగలలో కూడా సరైన తిండి, బట్టలు లేక పేద ప్రజలు అల్లాడుతున్నారు. మళ్లీ జగన్ వచ్చి ఉంటే మాకు బాగుండేది.

– వెంకట లక్షుమ్మ, స్థానికురాలు, వేంపల్లె

ప్రభుత్వం ఉందా అనే ప్రశ్నతో ప్రజలు ఉన్నారు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఉందా అని ప్రజలు తనకు తాము ప్రశ్నించుకుంటున్నారు. కూటమి నేతల మాయ మాటలు, అబద్ధాలు నమ్మి మోసపోయామని ప్రజలు పశ్చాతాప పడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు అవగాహనతో అమలు చేయగలిగే హామీలనే ఇచ్చారని కూటమి నేతలు మాత్రం అమలు చేయలేని హామీలు ఇచ్చి గద్దెనెక్కారు. జగన్ ఉంటే బాగుండేదని ప్రజల్లో ఇప్పుడు కనిపిస్తోంది.

– చంద్ర ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వేంపల్లె

ఉత్తరా నక్షత్రం రోజు ఆలయాన్ని సందర్శించండి

పులివెందుల టౌన్ : హరిహర పుత్రుడు శ్రీఅయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం రోజు హిందువులు ప్రతి ఒక్కరూ ఆలయాలను సందర్శించుకోవాలని అయ్యప్ప భక్తమండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరా నక్షత్రం రోజున అయ్యప్ప దీక్షతీసుకున్న భక్తులు, హిందువులు ప్రతి ఒక్కరు అయ్యప్ప ఆలయాలను, ఇతర ఆలయాలను సందర్శించి తమ భక్తిని చాటుకోవాలన్నారు. ఈనెల 19వ తేదీన వచ్చే ఉత్తరా నక్షత్రం రోజున అయ్యప్ప దీక్షలో ఉన్న రీతిలోనే భక్తులు ఉపవాసాలు ఉండి ఆదేవదేవున్ని దర్శించి తరించాలన్నారు.

రైతులకు యూరియా తెప్పించండి సారూ..!

వేంపల్లె : మండల వ్యాప్తంగా అన్ని ఫెర్టిలైజర్ షాపుల్లో యూరియా అడిగితే లేదంటున్నారని వ్యవసాయ అధికారులు స్పందించి రైతులకు త్వరగా యూరియాను తెప్పించాలని వేంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లి, కుమ్మరాంపల్లె గ్రామాల రైతులు కోరుతున్నారు. కొన్ని ఫర్టిలైజర్ షాపుల్లో పాస్పేట్ తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. రైతులకు ఏది అవసరమైతే అది తీసుకుంటారని వాళ్లు చెప్పినట్లు తీసుకోవాలని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. గ్రామ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్లలో వరి రైతులకు యూరియా ఎంతో అవసరమని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలా రైతులను ఇబ్బందులకు గురి చేస్తే తగిన మూల్యం చెల్లిస్తారన్నారు.

క్లుప్తంగా

ఆదుకోవాలని నిరసన

కొండాపురం : మండలంలోని దొంతికొన సమీపంలో ఉన్న అదానీ హైడ్రోపవర్ ప్రాజెక్టు సంస్థ కింద ఓ కాంట్రాక్టర్ కింద విశ్వనాథ్ పని చేసేవాడు. బుధవారం రావికుంట వద్ద వాటర్ ట్యాంక్ బోల్తా పడిన ఘటనలో విశ్వనాథ్ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని తిరుమలాయపల్లె గ్రామ ప్రజలు ఆ సంస్థ నిర్మాణ పనులు జరిగే చోట నిరసన చేపట్టారు.

జూదరులు అరెస్ట్

పులివెందుల రూరల్ : పట్టణంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. కృష్ణారెడ్డి శ్రీనివాసరెడ్డి, కిరణ్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను, రూ.35,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్?

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంను విజయవాడ ఎస్‌టీఎఫ్ బృందం ఈఎస్ మధుబాబు ఆధ్వర్యంలో గురువారం అకస్మీకంగా తనిఖీ నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ పరిధిలోని నడుస్తున్న మద్యం దుకాణాలపై ఆరా తీసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ విషయంపై ఫోన్‌లో ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ సీఐని వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

అటవీ ప్రాంతాల్లో భారీ మంటలు


కాలిపోతున్న శేషాచలం అటవీ ప్రాంతం

చింతకొమ్మదిన్నె : మండలంలోని శేషాచల అటవీ ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల గురువారం సాయంత్రం భారీ మంటలు ఎగిసిపడటం కనిపించింది. రసూల్‌పల్లి బీట్ పరిధిలో దౌలతాపురం పడమర దిశలోని అటవీ ప్రాంతంలో, బుగ్గవంక డ్యాంకు దక్షిణ దిశలోని చిన్న గాడి, పెద్దగాడి అటవీ ప్రాంతాల్లో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. అడవిలోని విలువైన మొక్కలు, వృక్షాలు కాలిపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేని పరిస్థితులు కలిగే ప్రమాదం ఉంది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వీల్స్ ఇండియా ప్రైవేట్ కంపెనీ వారు పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ మేళాను నిర్వహించారు. అనంతరం 15 మంది నిరుద్యోగులను ఎంపిక చేశారు.

ఘనంగా 17వ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న విశ్వాసులు

జమ్మలమడుగు : పట్టణంలో ఎస్పీజీ క్వార్టర్స్ లోని సీఎస్ఐ చర్చి 17వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిషప్ మాట్లాడుతూ సంఘం సభ్యులు ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

కమలాపురం : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల దరఖాస్తుకు వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పిన ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జమ్మలమడుగు : పట్టణంలో పశువుల మేత లోడ్‌తో వెళ్తున్న చొప్ప (జొన్నకంకి) ట్రాక్టర్‌కు నిప్పు అంటుకుంది. గురువారం పాత బస్టాండ్‌లో ప్రజలు చూస్తుండగానే ట్రాక్టర్ మధ్యలో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు గుర్తించి ట్రాక్టర్ డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే ట్రాక్టర్ కట్టిన తాళ్లను తొలగించి ట్యాలిని పైకి ఎత్తి రోడ్డుపైనే పశువుల మేతను వదిలేశారు. వెంటనే పోలీసులు స్థానిక ప్రజలు నీరు పోసి మంటలను ఆదుపు చేశారు. ట్రాక్టర్‌లో మంటలు ఆరిపోయాయని వెళ్లిన ట్రాక్టర్‌లో తిరిగి ఫైర్ స్టేషన్ సమీపంలో మంటలు వ్యాపించాయి. దీంతో ఫైర్ అధికారులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పించారు.

పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి


ఇడుపులపాయను సందర్శించిన పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు

వేంపల్లె : పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యార్థి దశ నుంచే ముందుకెళ్లాలని, అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం ట్రిపుల్ ఐటీకి కడప పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించారు. ముందుగా వీరికి డైరెక్టర్‌తోపాటు పరిపాలనాధికారి రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌లు స్వాగతం పలికారు. చిన్న వయసులోనే చదువుపట్ల శ్రద్ధ చూపడం, పెద్ద, పెద్ద కళాశాలల్లో స్థానం సంపాదించుకునే విషయాలపై మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరం


మాట్లాడుతున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు చాలా వరకు నివారించవచ్చునని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించిన మాట్లాడారు. వాహనదారులు లైసెన్స్ ఉన్న డ్రైవర్లకు మాత్రమే వాహనాలు ఇవ్వాలన్నారు. యూవతకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించేలా సూచించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ భవానీ పాల్గొన్నారు.

అప్కాస్ వ్యవస్థను రద్దుచేస్తే ఉద్యమిస్తాం


ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అప్కాస్ వ్యవస్థను రద్దు చేసి వాటి స్థానంలో కాంట్రాక్టర్ల ద్వారా ఉద్యోగులను నియమించేలా తీసుకుంటున్న నిర్ణయాలతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పట్టణ సీఐటీయూ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట అప్కాస్ ఉద్యోగులతో కలసి వారు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆయన సూచించారు. అప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే క్రైస్తవులకు లబ్ధి

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే క్రైస్తవులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూరిందని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వర్రా డెవిడ్ తెలిపారు. గురువారం ఆయన చిలంకూరులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఫాస్టర్లకు గౌరవ వేతనం పెట్టారన్నారు. ప్రతి నెల రూ.5 వేలు గౌరవ వేతనం అందించే వారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచిన తరువాత ఫాస్టర్లకు గౌరవవేతనం ఇవ్వలేదన్నారు. ప్రార్థనా స్థలాల నిర్వహణకు ప్రత్యేక నిధులు, బరియల్ గ్రౌండ్ స్థలాలను కేటాయించారన్నారు. ఫాస్టర్లకు వివాహ రిజిస్ట్రేషన్ లైసెన్స్‌లు సచివాలయ స్థాయిలోనే పత్రాలు అందించారన్నారు.

టీడీపీ అనైతిక రాజకీయాలు చేస్తోంది


మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఇద్దరు వైకాపా కౌన్సిలర్లు కేవలం తమ స్వార్థం కోసమే పార్టీని వీడారని పులివెందులలో టీడీపీ నాయకుల నీచ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయన కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ నాయకులు డబ్బులు, ఇతర ప్రలోభాలకు గురిచేసి వైసీపీ కౌన్సిలర్లను కొనడం జరిగిందన్నారు. వైఎస్ కుటుంబం తమపై ఎంతో నమ్మకం ఉంచి తమకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లుగా అవకాశం ఇచ్చారన్నారు. పట్టణంలో కానీ, అలాగే వార్డులలో గానీ ఏమైనా సమస్యలు ఉంటే చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిల దృష్టికి తీసుకెళితే ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. అలాంటి వైఎస్ కుటుంబానికి ఇద్దరు కౌన్సిలర్లు మోసం చేశారన్నారు. డబ్బుకు ఆశపడి కన్న తల్లి లాంటి పార్టీని వదిలి వెళ్లడం నీచమైన చర్య అన్నారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తామంతా చివరి వరకు వైఎస్ కుటుంబం వెంటే నడుస్తామన్నారు.

సరోజినీ నాయుడు మహిళా లోకానికి ఆదర్శం


సరోజిని నాయుడు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె : స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు యావత్ మహిళా లోకానికి ఆదర్శమని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. గురువారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఎంపవర్మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్థానిక ఆ కళాశాల ప్రాంగణంలో సరోజిని నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. మొట్టమొదటి మహిళా గవర్నర్‌గా పనిచేసిన సరోజిని నాయడు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం : బీసీ, ఎస్సీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 12వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ కాగా.. ప్రభుత్వం ఈనెల 15వ తేదీవరకు రుణాల దరఖాస్తులకు గడువు పెంచిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎస్ఐ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

జమ్మలమడుగు : రాయలసీమ డయాసిస్ పరిధిలో ఉన్న సీఎస్ఐ ఆస్తుల రక్షణే తమ లక్ష్యమని బిషప్ ఐజాక్ వరప్రసాద్ తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎస్ఐ ఆస్తులు కబ్జాలకు గురికాకుండా పరిరక్షణతోపాటు వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాన కూడళ్లలో ఉన్న స్థలాలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడతామన్నారు. సీఎస్ఐ ఆస్తుల పరి రక్షణ బాధ్యతలను డాక్టర్ రవీంద్ర, కిరణ్‌లకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట వేడుకలు


ఆలయంలో కలశారాధన కార్యక్రమం

తొండూరు : మండలంలోని అగడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమద్ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం ఆలయ ప్రవేశం, గోపూజ, గణపతిపూజ తదితర పూజలతోపాటు అభిషేకాలు, సాయంత్రం యాగశాల బలి, కలశారాధన, పూర్ణాహుతి, నైవేద్యం, అగ్ని ప్రతిష్ట, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటానికి సిద్ధం


సీడీపీఓ రాజేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

జమ్మలమడుగు : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే 17వ తేదీ ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సెక్రటరీ భాగ్యమ్మలు గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామంటూ మినిట్స్ ఇచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం అంగన్‌వాడీలను ఏమాత్రం పట్టించుకోకుండా రాజకీయ వేధింపులకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలన్నీ పూర్తి చేయండి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

సింహాద్రిపురం : మండలంలో చేస్తున్న సర్వేలన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక సచివాలయం–1, 2లను ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంధంగా ప్లాస్టిక్ నిషేధం


మాట్లాడుతున్న నగర కమిషనర్ పగడాల జగన్నాథ్

కమలాపురం : మార్చి నెల 1వ తేదీ నుంచి చేపట్టిన ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు, వినియోగదారులు స్వచ్ఛంధంగా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం స్థానిక 2వ వార్డు సచివాలయంలో దుకాణాదారులు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని, ఆ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, పేపర్ కవర్లు, గ్లాసులు వినియోగించాలన్నారు.

ముఖ్యంగా వ్యాపార సంస్థల ప్రతినిధుల సహకారం ఉంటే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధిస్తామన్నారు. ఎవరైన ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే ప్రతి దుకాణాదారుడు తన షాప్ బయట ప్లాస్టిక్ నిషేధంకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వ్యాపార సంస్థల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం


కొత్తపల్లె కాలువలో నిల్వ ఉన్న చెత్తాచెదారాలు

పులివెందుల రూరల్ : పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో ఎక్కడ చూసినా రోడ్లపైన, కాలువల్లో చెత్తాచెదారాలతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామాల్లో చెత్తాచెదారాలు రోజురోజుకు పెరిగిపోతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొత్తపల్లె, మల్లికార్జునపురం, చంద్రగిరి, రాగిమానుపల్లె, తుమ్మలపల్లె, కనంపల్లె, నల్లగొండువారిపల్లెల్లో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్త చెదారాలే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి


శిక్షణకు హాజరైన మండల సమాఖ్య సభ్యులు

వీరపునాయునిపల్లె : పేదరిక నిర్మూలనకు డ్వాక్రా సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆమె హాజరై మాట్లాడారు. గ్రూపులోని ప్రతి సభ్యురాలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అల చేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. మంచి ఫలితాలు సాధించాలంటే పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. లీడర్లు, పాలక వర్గ సభ్యులు, సభ్యులు తమ యొక్క బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌లు బాగ్యమ్మ, గంగాధర్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ జయసుధ, గ్రామ సమాఖ్యల అధ్యక్షులు, అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని వినతి


తహసీల్దార్ నజీర్ అహమ్మద్‌కు వినతిపత్రం అందిస్తున్న హిందు జేఏసీ నాయకులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధి కదిరి రోడ్డులో అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణాన్ని అడ్డుకోవాలని హిందు జేఏసీ నాయకులు గురువారం తహసీల్దార్ నజీర్ అహమ్మద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎర్రగుడిపల్లె గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 73/5, 79/6 గల భూమిలో వేసిన 90 శాతం ప్లాట్లను హిందువులు కొన్నారని, కొంతమంది వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లల్లో మసీదు నిర్మాణం చేపట్టారన్నారు. స్థానికంగా ఉన్నటువంటి 90 శాతం మంది ఆ మసీదు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నా మసీదును నిర్మిస్తున్న వ్యక్తులు మిగతా ప్రజల అభిప్రాయాలను లెక్కచేయకుండా మసీదు నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి మసీదు నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ తహసీల్దార్‌ను కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ శివాజీ సేన జిల్లా అధ్యక్షుడు కొప్పల శ్రీనివాస్‌రెడ్డి, హిందు జేఏసీ నాయకులు తుపాకుల సాగర్, లోకేష్, రిటైర్డ్ టీచర్ రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవరోజు గురువారం స్వామికి చండీహోమం, శ్రీ చక్రార్చన, ఇతర పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ యాగ శాలలో చండీహోమం, శ్రీచక్ర మండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీ విజయ దుర్గా మల్లికార్జునులకు ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం బ్రహ్మోత్సవాల ప్రత్యేక దర్శనాల కోసం విచ్చేసిన భక్తులతో ఉదయం నుంచి సందడిగా మారింది. స్థానిక బృందాలతోపాటు సమీప గ్రామాల నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన కోలాటం బృందాలు అమ్మవారి సన్నిధిలో నృత్యాలు చేసి భక్తులను అలరించి తమ భక్తిని చాటుకున్నారు.

నేడు కల్యాణం

మాఘ బహుళ విదియ జగన్మాత శ్రీ విజయ దుర్గా దేవి కడప లో కొలువు తీరిన పర్వదిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటలకు కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు అమ్మవారు నగరోత్సవం నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.